క్లుప్తంగా

ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ కరుణాకర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ శనివారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి ఎఫ్ఐఆర్ నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చిన బాధితుల ఫిర్యాదులపై విచారణ చేసి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్సైకి ఆదేశించారు. రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్, ఏఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

శ్రీవారాహిదేవి గుప్త నవరాత్రి ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాంబశివ ఆలయంలో వారాహిదేవి గుప్త నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో దీపం, మంగళహారతి, గుండు దోసకాయ, కూర దోసకాయతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజన చేశారు. హాజరైన భక్తులకు పూజారి రమేశ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోనోకార్పస్ మొక్కల తొలగింపు



రామగుండం: మనుషుల ఆరోగ్యానికి హాని చేస్తాయన్న ఉద్దేశంతో ప్రధాన రహదారుల డివైడర్ల మధ్య నాటిన కోనోకార్పస్ మొక్కలను బల్దియా సిబ్బంది తొలగిస్తున్నారు. శనివారం రామగుండం రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిలో ఉన్న వందలాది మొక్కలను బల్దియా సిబ్బంది నరికివేసి అప్పటికప్పుడు ట్రాక్టర్‌లో తరలిస్తూ ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. కోనోకార్పస్ మొక్కలు మొదళ్ల నుంచి తొలగించకపోవడంతో వర్షాకాలం కావడంతో మరింత తొందరగా చిగురించే అవకాశాలు లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు. బల్దియా సిబ్బంది మొక్కలను తొలగించే ఉద్దేశమే ఉంటే చెట్టు మొదళ్ల నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆశవర్కర్లకు వేతనం పెంచాలి



మాట్లాడుతున్న జయలక్ష్మి

పెద్దపల్లిరూరల్: సుమారు ఇరవై ఏళ్లుగా ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యసేవలు అందిస్తున్న ఆశ వర్కర్లకు కనీసవేతనం రూ.26వేలకు పెంచాలని ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి జూలై 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. జ్యోతి, శారద, రూప, సునీత, రమ, స్వప్న, కోమల, సీఐటీయూ నాయకుడు రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



యైటింక్లయిన్‌కాలనీ: సెమ్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో స్థానిక స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. పదో తరగతి విద్యార్థి వైష్ణవి రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు, 8వ తరగతి చదువుతున్న ప్రవస్తా స్టేంట్ 4వ, నాలుగో తరగతి చదువుతన్న అశ్వినికి 4వ ర్యాంకు సాధించారు. శనివారం హైదరాబాద్ బాల సుందరయ్య విజ్ఞాన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసపత్రం, మెమొంటో, క్యాష్ ప్రైజ్ అందుకున్నారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం రవీందర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రహదారులు బురదమయం

- డ్రైనేజీలు లేక అంతర్గత రోడ్లపై నిలుస్తున్న మురుగునీరు
- గ్రామస్తులు, విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపునీరు

మంథనిరూరల్: గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావడంతో చినుకురాలితే చాలు రహదారులు చిత్తడిగా మారుతున్నాయి. అంతర్గత రహదారులన్నీ సీసీరోడ్లుగా మారినా బురద, మట్టి మాత్రం పోవడం లేదు. మురుగు కాల్వలు లేకపోవడం, ఉన్నచోట పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో గ్రామీణ ప్రజలు నడిచేందుకు నానా తిప్పలు పడుతున్నారు.

34 గ్రామపంచాయతీల్లో..

మంథని మండలంలోని 34 గ్రామపంచాయతీల్లో అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షం పడితే మురుగునీరు రహదారులపై నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. మురుగునీటిని తొలగించి శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక అధికారుల పాలనలో..

గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే మండల స్థాయి అధికారులను పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. వరు గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించడం లేదని, వారంలో ఒకటి రెండు సార్లు గ్రామాలను విజిట్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రహదారులపై నిలిచిన మురుగునీటిని తొలగించడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు..

పాఠశాలలు ప్రారంభమైన క్రమంలో విద్యార్థులకు బురద కష్టాలు తప్పడం లేదు. వర్షాలు కురిస్తే రహదారులన్నీ చిత్తడిగా మారి ప్రమాదకరంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల వర్షపు నీటికి బురదమయమై విద్యార్థులు జారి పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి అంతర్గత రహదారులపై నిలుస్తున్న నీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

బురద పేరుకుపోతోంది



వర్షాకాలంలో రోడ్లపై బురద పేరుకుపోయి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇళ్ల ముందే వర్షపునీరు నిలిచి బురదమయం అవుతోంది. బయటకు వెళ్లాలంటేనే భయం వేస్తోంది. రోడ్లపై నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలి.

– పందిళ్ల నర్సయ్య, మల్లారం

డ్రైనేజీ లేక రోడ్లపైనే నీరు



వర్షం పడితే చాలు బయట కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. డ్రైనేజీలు లేక ఇళ్లలోంచి నీళ్లన్నీ రోడ్ల మీదకే వస్తున్నయ్. వర్షపు నీరు వెళ్లడానికి దారి లేక రోడ్లపైనే నిలిచి బురద అవుతోంది. అధికారులు స్పందించి మా ఇబ్బందులు తొలగించాలి.

– మానెం రాజేందర్, మల్లారం

అడ్డంకులు మాని.. అభివృద్ధిలో కలిసిరండి



భూమిపూజ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని: మంథని ప్రాంత అభివృద్ధికి దోహదపడేలా అందరూ సహకరించాలని, ఇందుకు సీనియర్ సిటిజన్స్, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు ఇలా అభివృద్ధి కాంక్షించే వారి ఆలోచనలు పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంథనిలో శనివారం ఆయన కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. గోదావరి నదిపై మంథని నుంచి శివారం వరకు రూ.125 కోట్లతో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుసంధానంగా రూ.162కోట్లతో మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ నుంచి 9.4 కిలోమీటర్ల మేర ఫోర్ లేన్ రింగ్ రోడ్డు పనులు, రూ.22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, రింగ్ రోడ్డులో భూములు కోల్పోయే రైతులకు పరిహారం అందించి అందరికీ న్యాయం చేస్తామన్నారు.

చెత్త వేయకుండా ముగ్గులు వేసిన బల్దియా సిబ్బంది



ముగ్గులు వేస్తున్న పారిశుధ్య సిబ్బంది

కోల్‌సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం కార్పొరేషన్ సిబ్బంది గార్బేజ్ వాల్నరబుల్ పాయింట్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా స్థానిక పోచమ్మగుడి పక్కనున్న ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక కొంతకాలంగా పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించారు. మళ్లీ చెత్త పడవేయకుండా పారిశుధ్య సిబ్బంది ఆ ప్రాంతంలో ముగ్గులు వేశారు. విఠల్‌నగర్ పట్టణ ప్రకృతి వనంలో ఉన్న మహిళా భవన్ గోడలపై సందేశాత్మక చిత్రాలు వేశారు. గాంధీనగర్‌లో కాలువ పూడికతీత పనులు చేపట్టారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పనులను పర్యవేక్షించారు. వేర్వేరుగా నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి, నాగభూషణం, హెల్త్ అసిస్టెంట్ సంపత్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, సీవో ప్రియదర్శిని, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మంథని: విద్యార్థులు చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో డార్మెంటరీ రూమ్, కిచెన్, జూనియర్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలించారు. రైస్ స్టాక్, కూరగాయలను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడి సిబ్బందిని అభినందించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. విద్యాబోధన, హాస్టల్‌లో భోజనం నాణ్యత, వసతులు, పారిశుధ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రతీరోజు కొంత వ్యాయామం చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రామగుండం: నానో యూరియా వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. అంతర్గాం రైతుభవన్‌లో శనివారం జరిగిన అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు మాట్లాడారు. యూరియా అధిక మోతాదులో వినియోగించవద్దన్నారు. అవసరానికి మించి వాడి తే నేలలు గుల్లబారుతాయని తెలిపారు. నానో యూరియాతో నత్రజని వందశాతం మొక్కలకు అందుతుందన్నారు. వరి, పత్తి, ఆయిల్‌పామ్‌కు నానో యూరియా వినియోగించవచ్చని వెల్లడించా రు. అనంతరం బ్రాహ్మణపల్లిలో ఆయిల్‌పామ్ సాగును పరిశీలించారు. శాస్త్రవేత్తలు భాస్కర్, వెంకన్న, కిరణ్, వినోద్, నవ్య, మండల వ్యవసాయాధికారి సతీశ్, ఏఈవోలు రమేశ్, హరీశ్ పాల్గొన్నారు.

జాతీయ సమ్మె జయప్రదం చేయండి

రామగిరి: కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ పా గౌతమ్ పోట్రుకు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ కొత్తగూడెం రీజియన్ ప్రధాన కార్యదరి సంజీవ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో షుగర్ పరీక్షలు, దంతాలు, జనరల్ సమస్యలపై పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

• తుర్కలమద్దికుంట ప్రైమరీ స్కూళ్లో చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. మద్యం సేవించి ఖాళీ సీసాలు అక్కడే పడేశారు. స్కూళ్లో అమర్చేందుకు తెచ్చిన 4 ఫ్యాన్లు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారంటూ పెద్దపల్లిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం మంజులత తెలిపారు. దీనిపై ఫిర్యాదు అందిందని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా ఏరియా, టీచర్స్ కాలనీలో రోడ్డు వెడల్పు పనుల కారణంగా భూంనగర్, శివపురికాలనీ, సంగీత థియేటర్ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

• లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేటకు చెందిన రాచకొండ పద్మ ఇటీవల మరణించింది. కాగా ఆమె కుటుంబ సభ్యులకు లయన్స్‌క్లబ్ ఆఫ్ రంగనాయక డిస్ట్రిక్ట్ 320జి ఆధ్వర్యంలో శనివారం రూ.8వేలు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కొమ్ము కరుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, అశోక్, మోహన్, నాగరాజు ఉన్నారు.

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముత్తారం: ముత్తారానికి చెందిన ఇనుముల ఓదెలు(46) వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. ఈనెల 11న గ్రామానికి చెందిన ఇనుముల ఓదెలు, తన భార్య నిర్మలతో కలిసి రామగిరి మండలం బేగంపేట ఎక్స్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌కు తన త్రిచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి ముత్తారానికి వస్తుండగా కాసర్లగడ్డలోని విద్యుత్తు స్తంభానికి ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఓదెలుకు బలమైన గాయాలు కావడంతో ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• బీమా చెక్కులు పంపిణీ

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో వివిధ కారణాలతో 9మంది మెప్మా సభ్యులు మృతిచెందారు. కాగా వాళ్ల కుటుంబాలకు శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు బీమా చెక్కులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రూ.34.65లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మెప్మా సంఘం సభ్యులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మార్కెట్ చైర్‌పర్సన్ స్వరూప, మేనేజర్ మనోహర్, తహసీల్దార్ రాజయ్య ఉన్నారు.

• స్కూల్ బ్యాగుల పంపిణీ

గోదావరిఖనిటౌన్: రామగుండం ప్రాంతానికి చెందిన పారామిలటరీ జవాన్లు ఆర్థిక సహకారంతో స్థానిక గాంధీపార్క్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 1వ తరగతి విద్యార్థులకు శనివారం సుమారు 50 స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల నాయకులు దయానంద్ గాంధీ, పారామిలటరీ జవాన్లు శ్రీనివాస్, నరేశ్, మనోహర్, జబ్బర్ అహ్మద్, సదానందం, అజయ్, ప్రవీణ్‌గౌడ్, రంజిత్‌కుమార్, లక్ష్మణ్‌రావు, కుమారస్వామి, సురేశ్, శివకుమార్, పాఠశాల హెచ్ఎం కాల్వ రాంబాబు, ఉపాధ్యాయులు సంపత్, రమేశ్, విజయశాంతి, గౌరీపార్వతి పాల్గొన్నారు.

• సంపు నిర్మాణం పూర్తయినా నీటి సరఫరాపై నిర్లక్ష్యం

రామగుండం: పట్టణంలోని పాత ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మితమైన వాటర్ సంపు పనులు పూర్తయినా, మోటారు బిగించి నీటి సరఫరా చేయడంపై అధికారులు చోద్యం చూస్తున్నారని మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ ఆరోపించారు. కార్పొరేషన్ 20వ డివిజన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాన డ్రైనేజీ నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

• సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నేత్రదానం

కోల్‌సిటీ: గోదావరిఖని మార్కండేయకాలనీకి చెందిన చింతకింది శ్రీహరి(80) అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై మృతుని దగ్గరి బంధువు, రిటైర్డ్ ఎస్సై శారద అవగాహన కల్పించారు. స్పందించిన మృతుడి భార్య అనసూర్య, కొడుకులు, కోడళ్లు శ్రీనివాస్–నీలిమ, అశోక్–లావణ్య, కూతురు, అల్లుడు స్వరూప–వేణుగోపాల్ అంగీకారం తెలిపారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు ఆధ్వర్యంలో, ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుని నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: ఓదెలలో పొత్కపల్లి ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు.

విద్యార్థుల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తా



అవగాహన కల్పిస్తున్న స్వప్న

కమాన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి పాఠశాలలో విద్యార్థుల సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.స్వప్న అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, భానుకృష్ణ, సంకీర్తన, అడ్వకేట్లు హనుమాన్ సింగ్, శరత్, రమేశ్‌బాబు, ఝాన్సీ పాల్గొన్నారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో సింగరేణి బొగ్గు, ఆర్ఎఫ్‌సీఎఫ్ యూరియా తరలించే గూడ్స్ రైలుమార్గంలో గౌతమినగర్ రైల్వేగేట్‌కు సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. సిగ్నల్ లైట్ వెలగకపోవడంతో ఇటీవల రైల్వేగేట్‌కు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. రైల్వే అధికారులు స్పందించి గౌతమినగర్ రైల్వేగేట్ వద్ద సిగ్నల్ లైట్లను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

బదిలీపై వెళ్తున్న ఏజీఎంకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొందనున్న దాసరి వెంకటేశ్వర్‌రావును శనివారం ఏజీఎం వెంకటేశ్వర్‌రావు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో సీఎస్పీ హెచ్‌వోడీ పైడీశ్వర్, అధికారులు నరసింహరావు, ఆఫీస్ స్టాఫ్ వేణు, పోషం, నరేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఫోర్‌మెన్లు రాజేందర్, రాజేశ్వర్‌రావ్, తిరుపతి పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాల సమస్యలు పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న వైవి రావు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీరావు కోరారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ టీ2 క్వార్టర్స్ ఏరియాలో శనివారం నాయకులతో కలిసి పర్యటించారు. కార్మికుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా డ్రైనేజీలను ప్రతీరోజు శుభ్రం చేయాలన్నారు. మురుగు కాలువలలో చెత్త చెదారం లేకుండా చూడాలని డిమాండ్ చశారు. అనంతరం సివిల్ డీజీఎం అధికారిని కలిసి సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. నాయకులు రాంచందర్, క్రాంతి కిరణ్, సంతోష్ ఉన్నారు.

దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



సుల్తానాబాద్: స్వీట్ తినిపిస్తున్న ప్రకాశ్‌రావు



యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు, రాజకీయ చాణక్యుడు మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అని బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దన్నాయక్ దామోదర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం వద్ద శనివారం మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న కాలంలో చాకచక్యంతో దేశంలో ఆర్థిక మాంద్యం రాకుండా చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, మాజీ ఎంపీటీసీ రాజలింగం, అమిరిశెట్టి తిరుపతి, రవీందర్, రఫీక్, రాజయ్య, బొంగోని అనిల్‌గౌడ్, పోచం పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి శనివారం నిర్వహించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ నాయకులతో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జక్కుల దామోదర్ రావు, మార్క రాజు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రధాన చౌరస్తాలో శనివారం ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు దాసరి విజయ్ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు కాల్వ లింగస్వామి, బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, గట్ల రమేశ్, ముస్తఫా, బొమ్మక రాజేశ్, నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, మాలెం మధు, మేకల పోషం పాల్గొన్నారు.

పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ సదస్సు

గోదావరిఖనిటౌన్: స్థానిక సెక్రెట్ హార్ట్ పాఠశాలలో ఎకో క్లబ్ కమిటీ శనివారం పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు నిర్వహించింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆరోగ్య మేరి మాట్లాడారు. పర్యావరణం నకు దేవుడు ప్రసాదించిన గొప్ప వరమని, దీన్ని భావితరాలకు అందించడమే అందరి కర్తవ్యమని అన్నారు. విద్యార్థులకు తడి, పొడి చెత్త గురించి వివరించారు. పర్యావరణంపై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆలోచింపజేశాయి. అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ మంగ, ఉపాధ్యాయులు తిరుమల, శ్వేత, ఝాన్సీ, జ్యోత్స్న పాల్గొన్నారు.

గూడెంలో వెలిసిన నాగదేవత



ఓదెల: మండలంలోని గూడెంలో నాగదేవత వెలిసింది. గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చి శనివారం పూజలు చేశారు. నాగదేవత విగ్రహం షెడ్డు నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి పనులకు శ్రీకారం చుట్టారు.